## దేవీ మండపాల వద్ద అన్నదానం



మాలధారులకు భోజనం పెడుతున్న రాజేందర్

టేకులపల్లి, అక్టోబర్ 18 : దేవీ మండపాల వద్ద అన్నదాన విద్యుత్‌శాఖ ఆర్టిజన్ జేఏసీ చైర్మన్ జర్పుల రాజేందర్ బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మద్రాస్‌తండా పంచాయితీ పరిధి కొండంగుల బోడులో కొత్తకొండ వీరబద్రస్వామి ఆలయంలో దుర్గామాత నవరాత్రులలో భాగంగా జర్పుల రాజేందర్,ఆశ దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజరి కేలోత్ శంకర్, జర్పుల రాంజీ, సంతోశ్, బాలాజీ పాల్గొన్నారు.

## రూ. రెండు లక్షలు పట్టివేత



టేకులపల్లి, అక్టోబర్ 18 : ఎన్నికల కోడ్‌లో భాగంగా మండల కేంద్రంలోని శివారులతో పోలీసులు చేపట్టిన తనీఖాల్లో రూ. రెండు లక్షలు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై గన్‌రెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి వాహన తనిఖీ నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా అతడి బైక్ ట్యాంక్ కవర్లో రూ.రెండు లక్షల రూపాయలు నగదును గుర్తించారు. వెంటనే ఎఫ్ఎస్‌టీ–3టీం అధికారిణి పి.వాసవీరాణికి అప్పగించారు.

## విస్తృతంగా వాహనాల తనిఖీ

చంద్రుగొండ, అక్టోబర్ 18 : ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్సై మాచినేని రవి స్పష్టం చేశారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఎదుట జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఆయన వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలదారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. రూ.50వేలకు మించి నగదును వెంట తీసుకెళ్లకూడదన్నారు.



చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై మాచినేని రవి

## టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీని పరామర్శించిన జీఎం ఆనంద్

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 18 : భూపాలపల్లి టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీ కొచ్చర్ల రవికుమార్ కుటుంబాన్ని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ పరామర్శించారు. బుధవారం రవికుమార్ కుమారుడు కొచ్చర్ల రాజ్‌కుమార్ దశదిన కర్మకు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకుడు కె. ప్రభాకర్ పాల్గొన్నారు.



# బోద బాధితులకు మెడికల్ కిట్ పంపిణీ

టేకులపల్లి, అక్టోబర్ 18 : మండలంలోని బోదకాలు వ్యాధిగ్రస్తులకు సులానగర్ పీహెచ్‌సీ వైద్యుడు కందుల దినేశ్ బుధవారం మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి జేవీఎల్ శిరీష ఆదేశానుసారం టేకులపల్లి మండలంలోని 28మందికి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యధిక మరణాలు దోమ కాటు వల్ల మాత్రమే సంభవిస్తున్నాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, సూపర్‌వైజర్లు నాగుబండి వెంకటేశ్వర్లు, గుజ్జ విజయ, వైద్య సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మెడికల్ కిట్‌లతో లబ్ధిదారులు, వైద్యులు

# ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంఘం నూతన కమిటీ

టేకులపల్లి, అక్టోబర్ 18 : మండల ఫొటో వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఆమెడ రమేశ్‌ను ఎన్నుకున్నారు. బుధవారం మండలం కేంద్రంలో ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతిచెందిన మండల కమిటీ సభ్యుడు భూక్య లక్ష్మణ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కిసర సుధాకర్‌రెడ్డి సమక్షంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షునిగా ఆమెడ రమేశ్, ప్రధాన కార్యదర్శిగా ఏ.దామోదర్, కోశాధికారిగా బి.రవికుమార్, గౌరవ అధ్యక్షునిగా ఏ.శ్రీనివాస్, కుటుంబ బరోసా సభ్యుడుగా పోతుగంటి సైదులు, జిల్లా సభ్యుడుగా యాసం రమేశ్, పూజారి సంపత్‌కు మార్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, నాగేశ్వరరావు, సురేశ్, జోగ శ్రీకాంత్, శేషు, కిరణ్, రవీందర్, రవి, గోపాలకృష్ణ, శేషయ్య, చింత భాస్కర్, అరుణ్ పాల్గొన్నారు.



లక్ష్మణ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న సభ్యులు

## టీబీజీకేఎస్ కృషి ఫలితంగానే కార్మికులకు లాభాల వాటా

### టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్



ఇల్లెందు రూరల్, అక్టోబర్ 18 : సింగరేణి కార్మికులకు లాభాల వాటా టీబీజీకేఎస్ కృషి ఫలితమేనని టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఎస్. రంగనాథ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాది 30శాతం ఉన్న లాభాల వాటాను ఈ ఏడాది 32శాతానికి పెంచిన ఘనత టీబీజీకేఎస్‌కే దక్కుతుందన్నారు. లాభాల వాటాతో పాటు దసరా అడ్వాన్స్‌ను ఈ నెల 21న కార్మికులకు చెల్లిస్తారన్నారు. దీని కోసం ఎంతగానో కృషి చేసిన టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత, అధ్యక్షుడు వెంకట్‌రావు, ప్రధాన కార్యదర్శి మిరియాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లన్నలకు ఏరియా కార్మికుల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం

### ప్రచారానికి అనుమతి తప్పనిసరి

### శాంతిభద్రతలకు విఘాతం కల్పించొద్దు

### ఓటర్లను ప్రలోభపెట్టినా చర్యలు తప్పవు

### డీఎస్పీ వెంకటేశ్

అశ్వారావుపేట, అక్టోబర్ 18 : అసెంబ్లీ ఎన్నికల్లో నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని, ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్ సూచించారు. ఎన్నికల ప్రచారం, సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. స్థానిక రైతువేదిక భవనంలో బుధవారం రాజకీయ పార్టీల నేతలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి కోసం సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ నుంచి పోలీస్ శాఖకు దరఖాస్తు వచ్చిన వెంటనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటికే రౌడీ షీటర్లపై బైండోవర్ కేసులు నమోదు చేశామని, గ్రామీణ ప్రాంతాల్లో ఘర్షణలకు నాయకులు, కార్యకర్తలు దూరంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించవద్దని ఆదేశించారు. ఎన్నికల్లో నమోదైన కేసులు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో సీఐ కరుణాకర్, ఎస్సై శ్రీకాంత్, వివిధ రాజకీయ పార్టీల బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్

## ఎమ్మెల్యే హరిప్రియ ప్రత్యేక పూజలు..

టేకులపల్లి, అక్టోబర్ 18 : దేవీనవరాత్రుల్లో భాగంగా బోడులో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి మండపం వద్ద ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఇర్ప లక్ష్మీనారాయణ, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న హరిప్రియానాయక్

## చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కారేపల్లి,అక్టోబర్ 18 : వాహన యజమానులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సీఐ తిరుపతిరెడ్డి అన్నారు. కారేపల్లి క్రాస్‌రోడ్‌లో ఇల్లెందు–ఖమ్మం ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన చేసిన చెక్‌పోస్ట్ వద్ద బుధవారం కారేపల్లి, కామేపల్లి ఎస్సైలు పుష్పాల రామారావు,ప్రవీణ్‌కుమార్ ఆద్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు.ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు పాటించాలన్నారు.వైరా నియోజకవర్గానికి చెందిన ప్లైయింగ్ స్క్వాడ్ బృందం చెక్‌పోస్ట్ వద్దకు చేరుకొని వాహన తనిఖీలను పర్యవేక్షించారు.

## ఏఎస్‌వోలకు క్షేత్రస్థాయిలో శిక్షణ

కొణిజర్ల, అక్టోబర్18: సెంట్రల్ సెక్రటరీ సర్వీసెస్ (గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) ద్వారా ఎంపికైన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లకు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని మండలంలోని గుబ్బగుర్తిలో బుధవారం నిర్వహించారు. నూతనంగా ఏఎస్‌వోలుగా ఎంపికైన పలువురు అభ్యర్థులకు గ్రామస్థాయిలో క్షేత్రస్థాయి గ్రామీణ ఆర్థిక సామాజిక పరిపాలన తదితర అంశాలపై శిక్షణ కల్పించనున్నారు.

## దుర్గామాతకు ప్రత్యేక పూజలు

కారేపల్లి, అక్టోబర్ 18 : దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద బుధవారం అమ్మవారు లలితాత్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు ధర్శనమిచ్చింది.

## ఓటును సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో, ఎస్సై

కారేపల్లి, అక్టోబర్ 18 : కొత్తగా ఓటు కోసం నమోదు చేసుకునేవారికి ఈ నెలాఖరు వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని ఎంపీడీవో ఎం.చంద్రశేఖర్, ఎస్సై పుష్పాల రామారావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువతీ, యువకులను కలిసి ఓటు హక్కుపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఓటర్లంతా ఎటువంటి ప్రలోభాలకు గరికాకుండా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం, ఐకేపీ సీసీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.